సంపుటి :02 సంచిక :161 పేజీలు :06

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com Voice of the people

శనివారం 16, ఆగస్టు 2025

## ప్రజలకు అండగా ఉంటాం


రాష్ట్ర మంత్రి కొండా సురేఖ 04



## భూనిర్వాసితుల రాస్తారోకో

- తమకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్
- ప్రభుత్వం బహిరంగ మార్కెట్ ధరను ఫాలో కావాలని విజ్ఞప్తి

03





## ఇందిరమ్మ పనుల్లో పురోగతి

### మొదటి విడత నిర్మాణంలో పుంజుకున్న వేగం

- రాష్ట్రంలోనే మూడో స్థానంలో జనగామ జిల్లా
- నాలుగో స్థానంలో మహబూబాబాద్
- సాంకేతిక కారణాలతో నిధులు అందని వారికి అవకాశం
- ఆధార్ అప్డేట్ చేసుకుంటే లబ్ధిదారుల ఖాతాల్లోకి సొమ్ము
- మరికొంత గడువు ఇచ్చిన సర్కార్
- మొదటి విడత పథకం వర్తించని వారికి శుభవార్త
- త్వరలో రెండో విడత లబ్ధిదారుల జాబితా

తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో పురోగతి సాధించింది. ఈ పథకంలో భాగంగా రాష్ట్రవ్యాప్తంగా లబ్ధిదారులకు పక్కా ఇళ్లు నిర్మించి, సొంతింటి కల నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నది. మొదటి విడత నిర్మాణ పనుల్లో జనగామ, మహబూబాబాద్ జిల్లాలు ముందంజలో ఉన్నాయి. జనగామ జిల్లాకు ప్రభుత్వం 5,950 ఇళ్లు కేటాయించగా, వాటిలో 2,659 ఇళ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. దీంతో జిల్లా 44.69% నిర్మాణ శాతంతో రాష్ట్రంలో మూడో స్థానంలో ఉంది. మహబూబాబాద్ జిల్లాకే 10,604 ఇళ్లు కేటాయించగా 4,457 ఇళ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. నిర్మాణ శాతం 42.03% నమోదై రాష్ట్రంలో నాలుగో స్థానంలో నిలుస్తున్నది. భద్రాద్రి జిల్లాలో పూర్తయిన ఇళ్లను సీఎం రేవంత్ రెడ్డి ఈ నెల 22న ప్రారంభించనున్నారు. మరోవైపు సర్కార్ రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల లబ్ధికి ఎంపికైనా వారి జాబితాను త్వరలోనే విడుదల చేస్తామని ప్రకటించింది.

– అక్షర దర్బార్, ప్రధానప్రతినిధి

02



## రెడ్ అలెర్ట్

- భూపాలపల్లి, ములుగు, మానుకోట జిల్లాలకు భారీ వర్ష సూచన
- ఈ నెల 19వరకు వర్షాలు కొనసాగే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక


04

అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాలకు వాతావరణ శాఖ ఎరుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో ఆదివారం అతిభారీ వర్ష సూచన ఉన్నట్లు పేర్కొంటూ.. ఎరుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది.

–అక్షరదర్బార్, హైదరాబాద్

## జలధార!

మహబూబాబాద్ జిల్లాలోని గూడూరు ఏజెన్సీలో భారీ వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తున్న భీమునిపాదం జలపాతం అద్భుత దృశ్యం. పచ్చని కొండల నడుమ పాలధారలా జాలువారుతూ, పర్యాటకుల మదిని దోచుకుంటున్న ప్రకృతి శోభ ఇది!





# ‘న్యూ విజన్’లో కృష్ణాష్టమి వేడుకలు

అక్షర దర్బార్ ,దుగ్గొండి : న్యూ విజన్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో శనివారం శ్రీకృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఉట్టి కొట్టే కార్యక్రమం నిర్వహించగా విద్యార్థుల, ఉపాధ్యాయుల కేరింతల నడుమ పదవ తరగతి విద్యార్థులు ఉట్టి కొట్టి బహుమతిని గెలుచుకున్నారు. విద్యార్థులు కృష్ణా ,రాధ గోపికా వేషధారణలో ఆకట్టుకున్నారు, కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ పోరెడ్డి నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ ఎరుకల మహిపాల్ రెడ్డి, డైరెక్టర్ మోతే రాజు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో..

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండల కేంద్రంలోని ఆరు శతాబ్దాల చరిత్ర కలిగిన శ్రీ మత్స్యగిరి స్వామి దేవాలయంలో శనివారం కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా జరిగాయి. దేవాలయ చైర్మన్ సామల భిక్షపతి ఆధ్వర్యంలో అర్చకులు ఆరుట్ల కృష్ణమాచారి శ్రీకృష్ణుడి పంచలోహ విగ్రహానికి పంచామృతాభిషేకం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వలపదాసు చంద్రమౌళి, సామల శంకరయ్య, మామిడి సాయి, కంబత్తుల ప్రకాష్, కోలగాని శ్రీనివాస్, మార్త సుమన్, బూర రామకృష్ణ తదితర భక్తులు పాల్గొన్నారు.







# ‘ఇందిరమ్మ’ పనుల్లో పురోగతి

## మొదటి విడత నిర్మాణంలో పుంజుకున్న వేగం

- రాష్ట్రంలోనే మూడో స్థానంలో జనగామ జిల్లా
- నాలుగో స్థానంలో మహబూబాబాద్
- సాంకేతిక కారణాలతో నిధులు అందని వారికి అవకాశం
- ఆధార్ అప్డేట్ చేసుకుంటే లబ్ధిదారుల ఖాతాల్లోకి సొమ్ము
- మరికొంత గడువు ఇచ్చిన సర్కార్
- మొదటి విడత పథకం వర్తించని వారికి శుభవార్త
- త్వరలో రెండో విడత లబ్ధిదారుల జాబితా

అక్షరదర్బార్, ప్రధానప్రతినిధి : రాష్ట్రప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు చేస్తున్నది. సొంతింటి కల నెరవేర్చేందుకు పక్కా ఇల్లు నిర్మిస్తున్నది. మొదటి విడత నిర్మాణ పనుల్లో జనగామ జిల్లా రాష్ట్రంలోనే మూడోస్థానంలో ఉంది. జిల్లాకు మొదటి విడతలో 5,950 ఇండ్లు మంజూరు కాగా, వాటిలో ప్రస్తుతం 2,659 ఇండ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. నిర్మాణ శాతం 44.69గా నమోదైంది. అలాగే మహబూబాబాద్ జిల్లా రాష్ట్రంలో నాలుగోస్థానంలో నిలిచింది. జిల్లాకు మొత్తం 10,604 ఇండ్లు మంజూరు కాగా, వాటిలో 4,457 ఇండ్ల పనులు పురోగతిలో ఉన్నాయి. నిర్మాణ 42.03శాతం నమోదైంది. రాష్ట్రంలో పలుచోట్ల పూర్తయిన ఇండ్ల పరిధిలో లబ్ధిదారులతో గృహ ప్రవేశాలు చేయించేందుకు యంత్రాంగం ఏర్పాట్లు చేస్తున్నది. మరోవైపు ప్రభుత్వం త్వరలో రెండో విడత లబ్ధిదారుల జాబితాను కూడా ప్రకటించేందుకు సన్నద్ధమవుతున్నది. సొంత స్థలం లేని వారికి ప్రభుత్వం స్థలం ఇవ్వనున్నది. అలాగే ప్రతి లబ్ధిదారుకు రూ.5 లక్షల చొప్పున సొమ్ము అందించనుంది. ఇప్పటికే మొదటి విడత ఇళ్లు విడుదల చేయగా, వాటిలో వేలాది ఇళ్ల నిర్మాణాలు ఇప్పటికే ప్రారంభమయ్యాయి. వాటిలో కొన్నిచోట్ల పనులు సైతం పూర్తయ్యాయి.

### - నిబంధనల కొర్రీలతో కొన్నిచోట్ల ఆలస్యం..

ప్రభుత్వం నిబంధనల మేరకే ఇంటిని నిర్మించుకోవాల్సి ఉండటం కూడా ప్రతిబంధకంగా మారుతున్నది. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఇందిరమ్మ ఇంటికి ప్రభుత్వం అందించే సాయంతో పాటు లబ్ధిదారుడు కూడా కొంత మొత్తాన్ని కలుపుకుని, తన అవసరాలకు తగ్గట్టుగా ఇంటిని నిర్మించుకున్నారు. ప్రస్తుతం 600 చదరపు అడుగుల పరిధిలోనే ఇందిరమ్మ ఇంటిని నిర్మించుకుంటేనే రూ.5 లక్షల సాయం అందుతుందని అధికారులు పేర్కొంటున్నారు. దీంతో చాలామంది లబ్ధిదారులు ఆలోచనలో పడుతున్నారు. కొద్దిగా ఆర్థికంగా ఉన్న లబ్ధిదారులైతే మళ్లీ ఇంటిని నిర్మించుకునే అవకాశాలు ఉండవని, కట్టుకునేదేదో కొంచెం విశాలంగా నిర్మించుకుంటే బాగుంటుందనే ఆలోచనలో ఉన్నారు. పిల్లలకు పెళ్లిళ్లు చేసినా, ఏదైనా ఇతర శుభకార్యం చేసిన ఇంటికి వచ్చే బంధు, మిత్రులకు చిన్న ఇంటితో ఇబ్బందిగా ఉంటుందని భావిస్తున్నారు. ప్రభుత్వం ఇచ్చే సాయంతో పాటు కొంత మొత్తాన్ని కలుపుకుని పెద్దగా ఇంటిని నిర్మించు కోవాలని భావిస్తున్నప్పటికి నిబంధనలు ప్రతిబంధకంగా మారుతున్నాయని లబ్ధిదారులు వాపోతున్నారు.

### ఆధార్ అప్డేట్ తప్పనిసరి..

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనుల్లో పారదర్శకత కోసం రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇళ్ల నిర్మాణ పనుల నమోదు కోసం ఒక యాప్ రూపొందించింది. యాప్ లో ప్రతి లబ్ధిదారు ఇల్లు నిర్మిస్తున్న స్థలాన్ని జియోట్యాగింగ్ చేయాల్సి ఉంటుంది. నిజమైన లబ్ధిదారులకు మాత్రమే ఇళ్లు అందించేందుకు కమిటీలను సైతం ఏర్పాటు చేశారు. ఇంటి పనుల్లో వేగం పెంచేందుకు ప్రభుత్వం లబ్ధిదారులకు ఉచితంగా ఇసుక అందిస్తోంది. ఈ నిర్ణయంతో లబ్ధిదారులపై ఆర్థిక భారం తగ్గడంతో పాటు పనులు కూడా వేగంగా జరుగుతాయని ప్రభుత్వం అంచనా. రాష్ట్రంలో కొన్ని చోట్ల ఇళ్ల నిర్మాణాలు చివరి దశకు చేరుకోగా, మరికొన్ని ప్రాంతాల్లో ఇప్పటికే పూర్తయ్యాయి. ప్రభుత్వం ఇళ్లను ప్రారంభించడానికి సిద్ధమవుతున్న నేపథ్యంలో పథకంపై ప్రజల్లో ఆశలు పెరుగుతున్నాయి. లబ్ధిదారుల ఆధార్ వివరాలు సరిగా లేని కారణంగా సుమారు 30 శాతం మందికి పథకం చెల్లింపులు ఆగిపోయాయి. దీంతో వారికి ప్రభుత్వం ఒక అవకాశం ఇచ్చింది. వారు రెండు రోజుల్లో ఆధార్, బ్యాంక్ ఖాతా వివరాలను సరిచేసుకోవాలని తెలిపింది. ప్రక్రియ పూర్తయితే లబ్ధిదారుల ఖాతాల్లోకి సులభంగా సొమ్ము జమ అవుతుంది. లబ్ధిదారులకు ఇది చివరి అవకాశం అని సర్కార్ ఇప్పటికే ప్రకటించింది. నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ఇండియా (ఎన్పీసీఐ), ఏపీబీఎస్ (ఆధార్ పేమెంట్ బ్రిడ్జి సిస్టం) ద్వారా ప్రభుత్వం లబ్ధిదారులకు సొమ్ము చెల్లిస్తున్నది.

### ఈ నెలలోనే ప్రారంభోత్సవాలు..

నెలలోనే కొన్ని ఇళ్లను ప్రారంభించేందుకు ప్రభుత్వం సిద్ధమవుతున్నది. శ్రావణ మాసం ఈ నెల 22తో ముగుస్తుండటంతో అంతకు ముందే గృహ ప్రవేశాలు చేయించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యోచిస్తున్నట్లు సమాచారం. సహజంగా భాద్రపద మాసాన్ని శుభకార్యాలకు శూన్యమాసంగా పరిగణిస్తారు కాబట్టి శ్రావణ మాసంలోనే ఈ కార్యక్రమాలను పూర్తి చేయాలని చూస్తున్నారు. పథకంలో భాగంగా రాష్ట్రంలోని ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 3,500 ఇళ్లు నిర్మించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని చండ్రుగొండ మండలం బెండాలపాడులో 50 ఇళ్ల నిర్మాణం పూర్తయింది. వీటిని సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గత ప్రభుత్వం అమలు చేసిన డబుల్ బెడ్ రూమ్ పథకంలా కాకుండా, ఈప్రభుత్వం ఇళ్ల నిర్మాణానికయ్యే సొమ్మును నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకే జమ చేస్తుంది. వివిధ స్థాయిల్లో విడతల వారీగా లబ్ధిదారులకు రూ.5 లక్షల వరకు అందిస్తుంది.

# పాకాల వీక్షణకు ఆంక్షలు

- మత్తడిపడుతున్న పాకాల చెరువు
- కట్టపైకి అనుమతించకపోవడంతో పర్యాటకుల అసంతృప్తి
- అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైనం
- పని తప్పించుకునే పనిలో అధికార యంత్రాంగం
- దూర ప్రాంతాల నుండి వస్తున్న వారికి చుక్కెదురు

అక్షర దర్బార్, నర్సంపేట/ఖానాపురం : కాకతీయుల కళా నైపుణ్యానికి నిదర్శనమైన పాకాల సరస్సు అందాల వీక్షణకు అధికారులు ఆంక్షలు విధించారు. కట్ట పైకి అనుమతి లేదంటూ బారికేడ్లు ఏర్పాటు చేశారు. దీంతో సుదూర ప్రాంతం నుంచి వచ్చిన పర్యాటకులు తీవ్ర అసంతృప్తితో వెనుదిరుగుతున్నారు. అధికార యంత్రాంగం ముందస్తుగా అనుమతి లేదని సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సుదూర ప్రాంతాల నుండి పేరుగాంచిన ధాన్యాగా ర భాండాగారానికి మారుపేరుగా నిలిచిన పాకాలను వీక్షిం చడానికి వచ్చామని ఇక్కడికి రాగానే అనుమతించక పోవడం చాలా దారుణమని వారు వాపోతున్నారు.



# పాకాల సరస్సు వద్ద మాజీ ఎమ్మెల్యే పెద్ది పూజలు



అక్షర దర్బార్, నర్సంపేట : నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి శనివారం పాకాల సరస్సు మత్తడి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాల కారణంగా సరస్సు మత్తడి పొంగిపొర్లుతున్న తరుణంలో, కట్టమైసమ్మ తల్లి వద్ద బీఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రత్యేక పూజలు చేసి, నియోజకవర్గ రైతులకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఓడీసీఎంఎస్ చైర్మన్ గుగులోతు రామస్వామి నాయక్, ఆర్బీఎస్ రాష్ట్ర మాజీ డైరెక్టర్ రాయిటి రవీందర్ రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ ఆకుల శ్రీనివాస్, మున్సిపల్ వైస్ చైర్మన్, మాజీ ఎంపీపీలు, మండల అధ్యక్షులు, మార్కెట్ చైర్మన్, మాజీ ఎంపిటీసీలు, సర్పంచులు, ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా శ్రీకృష్ణాష్టమి



అక్షర దర్బార్ వరంగల్: సీడ్స్ అండ్ పెస్టిసైడ్స్ డీలర్ల ఆధ్వర్యంలో శ్రీకృష్ణాష్టమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ముఖ్యఅతిథిగా బీఆర్ఎస్ నేత నాగూర్ల వెంకటేశ్వరరావు హాజరై కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో భారత్ సీడ్స్ రాజు, న్యూ పున్నమి సీడ్స్ రాజేందర్ రెడ్డి, అమూల్య సీడ్స్ దేసు ప్రవీణ్ కుమార్, భాస్కర ఆగ్రో కృష్ణాజి, నటరాజ సీడ్స్ సతీష్ కుమార్, గణపతి సీడ్స్ పైడయ్య, అమరేంద్ర బ్రదర్స్ ఆకుల హరేందర్, వంశీ సీడ్స్ సవాయి శీను రవి, అన్నపూర్ణ సీడ్స్ కొండల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## మద్యం సేవించి వాహనం నడిపి

# చిక్కుల్లో పడొద్దు

### వరంగల్ సీపీ సన్ ప్రీత్ సింగ్




అక్షరదర్బార్, హనుమకొండ; వాహనదారులు మద్యం సేవించి వాహనం నడిపి చిక్కుల్లో పడొద్దని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీత్ సింగ్ వాహనదారులకు సూచించారు. మద్యం సేవించి వాహనాలు నడిపే వాహనదారులు ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా రోడ్డుప్రమాదాలకు కారణమవుతున్నారని, అటువంటి ప్రమాదాల్లో వారు స్వయంగా ప్రాణాలు కోల్పోయే ఘటనలు కూడా సంభవిస్తున్నాయని పేర్కొన్నారు. ఈ కారణంగా అనేక కుటుంబాలు తీరని నష్టాన్ని చవిచూస్తున్నాయని, ఈ నేపథ్యంలో వరంగల్ పోలీస్ కమిషనరేట్ తరఫున డ్రంక్ అండ్ డ్రైవ్ నిరోధానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఈ చర్యల్లో భాగంగా ట్రైసిటీ పరిధిలో ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు నిరంతరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నారు. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోని పోలీస్ స్టేషన్ల పరిధిలో కూడా ఈ తనిఖీలు కొనసాగుతున్నాయని చెప్పారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో పట్టుబడిన వాహనదారులకు ముందుగా కమిషనరేట్ కార్యాలయంలోని ట్రాఫిక్ ట్రైనింగ్ సెంటర్‌లో కుటుంబ సభ్యుల సమక్షంలో పోలీసులకు చిక్కిన వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించబడుతుంది. అనంతరం న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచి, వారి తప్పిదానికి తగిన శిక్షలు విధించబడుతున్నాయని కమిషనర్ తెలిపారు. ఆగస్టు 9వ తేదీ నుండి వారం రోజుల్లో జరిగిన తనిఖీల్లో మొత్తం 324 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు అయ్యాయి. ఇందులో 16 మంది వాహనదారులకు కోర్టు రెండు రోజుల చొప్పున జైలు శిక్ష విధించగా, మిగితా మొత్తం వాహనదారులు కోర్టుకు రూ.3,95,400 జరిమానా చెల్లించారు. ఇందులో హన్మకొండ ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో 121 కేసులు నమోదవగా, నలుగురుకి జైలు శిక్ష పడగా, రూ.1,36,400 జరిమానాను కోర్టుకు చెల్లించారు. ఇదే రీతిలో కాజీపేట ట్రాఫిక్ స్టేషన్ పరిధిలో కేసుల106 కేసుల్లో ఐదుగురికి జైలు శిక్ష పడగా, రూ.1,69,300 జరిమానా, వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో మొత్తం 97 కేసుల్లో ఐదుగుకి జైలు శిక్ష పడగా, మిగితా కేసుల్లో రూ.89,700 జరిమానా చెల్లించారని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ సందర్భంగా "మీ కుటుంబ సభ్యుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎట్టి పరిస్థితుల్లోనూ మద్యం సేవించి వాహనం నడపవద్దు. మీ తప్పిదం వల్ల ఇతరుల ప్రాణాలు పోవచ్చు. కొందరు శాశ్వతంగాను, మరికొందరు జీవితాంతం మానసిక లేదా శారీరక వికారాలతో బాధపడే పరిస్థితి ఎదుర్కొంటారు. వాహనదారులు మీ గమ్యస్థానానికి సురక్షితంగా చేరుకోవడమే వరంగల్ పోలీసుల ప్రధాన లక్ష్యం" అని పోలీస్ కమిషనర్ స్పష్టం చేశారు.



## ప్రతిభావంతుడికి

# అడ్డుగా ఆర్థిక భారం

### –ఆదివాసీ క్రీడాకారుడికి సాయం అందించాలని వేడుకోలు

అక్షర దర్బార్, (నూగూరు) వెంకటాపురం/వాజేడు : ములుగు జిల్లా వాజేడు మండలం ఇప్పగూడెం గ్రామానికి చెందిన ఆదివాసీ క్రీడాకారుడు మోడెం వంశీ పేదరికంలో జన్మించి, అనేక కష్టాలను ఎదుర్కొంటూ వెయిట్‌లిఫ్టింగ్‌లో రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పతకాలు సాధించి ప్రతిభను చాటుకున్నాడు. పగలంతా ఒక జిమ్‌సెంటర్‌లో వాచ్‌మన్‌గా పనిచేస్తూ, రాత్రిళ్లు అదే జిమ్‌లో కఠిన సాధన చేయడం ద్వారా విజయాలను సొంతం చేసుకున్న వంశీ, ఈ నెల 22న కోస్టారికాలో జరగనున్న అంతర్జాతీయ వెయిట్‌లిఫ్టింగ్ పోటీలకు భారతదేశం తరఫున ఎంపికయ్యాడు. అయితే ఈ పోటీల్లో పాల్గొనడానికి సుమారు రూ. 4.50 లక్షలు ఖర్చవుతుండగా, ఆర్థిక ఇబ్బందులు అతనికి అడ్డుగా మారాయి. కనీస ఖర్చులు కూడా భరించలేక, సహృదయ దాతల సహాయం కోసం ఎదురుచూస్తున్నాడు. సహృదయులు ఎవరైనా ఫోన్ పే ద్వారా 80745 81584 నంబర్‌కు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

## భారీ వర్షాల దృష్ట్యా

# అప్రమత్తంగా ఉండాలి

అక్షర దర్బార్, నర్సంపేట : వచ్చే రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద సూచించారు. శనివారం ఆమె నర్సంపేట డివిజన్‌లోని పలు లో లెవల్ కాజ్‌వేలను పరిశీలించి భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. చెరువుల నీటిమట్టం గమని ప్రజలకు ముందస్తు హెచ్చరికలు ఇవ్వాలని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాజ్‌వేలపై ప్రజలను వెళ్లనీయవద్దని, అవసరమైన చోట హెచ్చరిక బోర్డు లు, పోలీసు నిఘా ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అత్యవసర పరిస్థితులకు ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు.



# పోలీసుల తనిఖీలు



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మొగుళ్లపల్లి మండల పరిధిలోని మొట్లపల్లి గ్రామంలోని జమ్మికుంటకు వెళ్లే ప్రధాన రహదారిపై ప్రొబిషనరీ ఎస్సై మానస ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహించారు.

# భూనిర్వాసితుల రాస్తారోకో

- తమకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్
- ప్రభుత్వం బహిరంగ మార్కెట్ ధరను ఫాలో కావాలని విజ్ఞప్తి

అక్షరదర్బార్, వరంగల్: వరంగల్ శివారులోని మామునూరు విమానాశ్రయం కోసం గుంటూరుపల్లి, గాడిపల్లి తదితర గ్రామాల రైతుల నుంచి భూ సేకరణకు ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. నిర్వాసితులకు మార్కెట్ రేటుకు అనుగుణంగా ధర చెల్లిస్తామని, ప్రభావిత గ్రామాలకు మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇచ్చింది. అలాగే భూసేకరణలో భాగంగా ఒక ఎకరానికి రూ.1.20 కోట్లు చెల్లించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని కలెక్టర్ సైతం హామీ ఇచ్చారు. బహిరంగ మార్కెట్‌లో సుమారు రూ.5 కోట్లు విలువ చేసే భూమికి, కేవలం రూ.1.20 కోట్లు చెల్లించడం సబబు కాదని రైతులు వాపోయారు. వరంగల్– నెక్కొండ ప్రధాన రహదారి వెంట ఉన్న భూములకైనా రూ.2 కోట్లు చెల్లించాలని వారు డిమాండ్ చేశారు. అయినప్పటికీ, ప్రభుత్వం నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో శనివారం ఉదయం నిర్వాసితులు వరంగల్– నెక్కొండ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. దీంతో మార్గంలో వాహన రాకపోకలు నిలిచిపోయాయి. పోలీసులు అక్కడికి చేరుకుని ఆందోళనకారులకు సర్దిచెప్పే ప్రయత్నం చేశారు.



రాస్తారోకో చేస్తున్న భూనిర్వాసితులు

# 24న రాష్ట్ర సదస్సు

**- ఖిలావరంగల్ లో పోస్టర్ ఆవిష్కరించిన వేదిక నాయకులు**

అక్షరదర్బార్, వరంగల్: మధ్య భారతంలో ఆపరేషన్ కగార్ ను ఆపివేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఆదివాసి హక్కుల పోరాట సంఘీభావ వేదిక ఆధ్వర్యంలో ఈనెల 24న హనుమకొండలోని అంబేద్కర్ భవన్ లో జరిగే రాష్ట్ర సదస్సును జయప్రదం చేయాలని వేదిక భాగస్వామ్య పక్షాల నాయకులు శనివారం ఖిలావరంగల్ పడమరకోట అంబేద్కర్ విగ్రహం వద్ద పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ గ్రేటర్ వరంగల్ కమిటీ కార్యదర్శి రాచర్ల బాలరాజు మాట్లాడుతూ.. ఈ సదస్సుకు పౌర హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్ అధ్యక్షత వహిస్తారని, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, హనుమకొండ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ భాస్కర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు జేవి చలపతిరావు, ప్రొఫెసర్ హరగోపాల్, డి నరసింహారెడ్డి, పౌర హక్కుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్ నారాయణరావు తదితరులు మాట్లాడుతారని తెలిపారు. ఈ సందర్భంగా ఐఎఫ్ టీయు జిల్లా అధ్యక్షుడు గంగుల దయాకర్, మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు బండి కోటేశ్వరరావు, పీడీఎం జిల్లా అధ్యక్షుడు గుడికందుల క్రాంతి, సీఎల్ సీ జిల్లా నాయకులు కాంపల్లి ప్రవీణ్, టీడీఎఫ్ నాయకులు పోరిక ఉదయ్ సింగ్ లు మాట్లాడుతూ ఆపరేషన్ కగార్ ను ఆపివేయాలని అన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మానవ హక్కుల వేదిక జిల్లా నాయకులు పాలకుర్తి సత్యనారాయణ, అరుణోదయ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నలిగంటి విజయ్ పాల్, ఏఐఎఫ్ టీ యూ జిల్లా అధ్యక్షుడు భైరబోయిన ఐలయ్య, పీవైఎల్ జిల్లా నాయకులు గంధ్రతి హరిబాబు, ఏఐకేఎంఎస్ కార్యవర్గ సభ్యులు ఇనుముల కృష్ణ, గద్దల సంజీవ తదితరులు పాల్గొన్నారు.







# ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటాం

**- రాష్ట్ర మంత్రి కొండా సురేఖ**

అక్షరదర్బార్, హనుమకొండ: వరంగల్ ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటామని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. శనివారం ఆమె హనుమకొండ రాంనగర్ లోని తమ నివాసంలో ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించారు. ప్రజల సమస్యలను సావధానంగా వింటూ అప్పటికప్పుడే సంబంధిత శాఖ అధికారులతో మంత్రి కొండా సురేఖ మాట్లాడి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ వరంగల్ ప్రజలు ఏ సమస్య ఉన్నా, ఎవరి వద్దకు వెళ్లి పైరవీలు చేయవలసిన అవసరం లేదని, నిరభ్యంతరంగా తనను సంప్రదించవచ్చని తెలిపారు. కాంగ్రెస్ పేదల ప్రభుత్వమని, పేదలకు సంక్షేమ పథకాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం అని, వరంగల్ తూర్పు నియోజకవర్గంలో అన్ని వర్గాల ప్రజలకు సమాన న్యాయం చేయడమే తమ లక్ష్యం అని మంత్రి కొండా సురేఖ తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాకు భారీవర్ష సూచన దృష్ట్యా ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. ఎలాంటి ఆపద సమయంలోనైనా కొండా దంపతుల ఇంటి తలుపులు ఎల్లవేళలా తెరిచే ఉంటాయని, కొండా దంపతులు కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటారని, పార్టీ కార్యకర్తలను, నాయకులను కొండా దంపతులు కంటికి రెప్పలా కాపాడుకొని గుండెల్లో పెట్టుకొని చూసుకుంటారని అన్నారు.

# భారీ వర్ష సూచన

- **భూపాలపల్లి, ములుగు, మానుకోట జిల్లాలకు రెడ్ అలెర్ట్**
- **ఈ నెల 19వరకు వర్షాలు కొనసాగే అవకాశం**
- **అప్రమత్తంగా ఉండాలని వాతావరణ శాఖ హెచ్చరిక**

అక్షరదర్బార్, హైదరాబాద్: అల్పపీడన ప్రభావంతో రాష్ట్రంలో మూడు రోజుల పాటు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. శనివారం రాత్రి నుంచి ఆదివారం ఉదయం వరకు జయశంకర్ భూపాలపల్లి, మహబూబాబాద్, ములుగు జిల్లాలకు వాతావరణ శాఖ ఎరుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది. హనుమకొండ, వరంగల్, మహబూబాబాద్, ములుగు జిల్లాల్లో ఆదివారం అతిభారీ వర్ష సూచన ఉన్నట్లు పేర్కొంటూ.. ఎరుపు రంగు హెచ్చరికలు జారీ చేసింది. అల్పపీడనం ప్రభావంతో ఈ నెల 19 వరకు రాష్ట్రంలో విస్తారంగా వర్షాలు కురుస్తాయని అధికారులు తెలిపారు. ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో ఇవాళ, రేపు అతి నుంచి అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. వరుసగా కురుస్తున్న వర్షాలకు వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. దీంతో మేడపల్లి, నరసింగాపురం, గోవిందాపూర్ గ్రామాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ప్రకటించింది.



మహబూబాబాద్ జిల్లా గూడూరు ఏజెన్సీలో జాలువారుతున్న భీముని పాదం జలపాతం

**- అప్రమత్తంగా ఉండాలి : సీఎం**

తెలంగాణ వ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సీఎం రేవంత్ రెడ్డి సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో శనివారం ఆయన ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండే జిల్లాల్లో సహాయక బృందాలు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. ఆ ప్రాంతాల్లో ఎస్డీఆర్ఎఫ్, ఎన్డీఆర్ఎఫ్ బృందాలను ముందుగానే మోహరించాలని ఆదేశించారు. వాగులు పొంగే ప్రమాదమున్న జిల్లాల అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ముంపు ముప్పు ఉన్న లోతట్టు ప్రాంతాల్లోని కుటుంబాలను సహాయక శిబిరాలకు తరలించాలని ఆదేశించారు. జలాశయాలను అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. నీటి విడుదలపై కలెక్టర్లు క్షేత్రస్థాయి సిబ్బందికి ముందస్తు సమాచారం ఇవ్వాలని ఆదేశించారు. పూర్తిగా నిండిన చెరువులు, రిజర్వాయర్ల వద్ద ఇసుక బస్తాలను సిద్ధంగా ఉంచాలని, ఆ ప్రాంతాల్లో రాకపోకలు నిలిపివేయాలని సూచించారు.

# సీఎంకు కృతజ్ఞతలు

**మొగుళ్లపల్లి పీఏసీఎస్ చైర్మన్ సంపెల్లి**



అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం పాలకవర్గాల గడువును రెండోసారి ఆరు నెలలు పొడిగించినందుకు సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, సీతక్క, ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావుకు మొగుళ్ళపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం చైర్మన్ సంపెల్లి నరసింగరావు, వైస్ చైర్మన్ కొమురోజు శ్రీనివాస్, డైరెక్టర్లు ధన్యవాదాలు తెలిపారు.



# మేడారం సందర్శించిన ఛత్తీస్ గఢ్ బీజేపీ నేతలు

అక్షరదర్బార్, మేడారం: ఛత్తీస్ గఢ్ రాష్ట్రం బీజేపీ నాయకులు శనివారం మేడారం సమ్మక్క సారలమ్మను దర్శించుకున్నారు. బీజేపీ బీజాపూర్ జిల్లా మాజీ అధ్యక్షుడు, బస్తర్ ఇన్‌ఛార్జి గుజ్జ వెంకట్ ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా బీజాపూర్ జిల్లా కమలం శ్రేణులు భారీ వాహన శ్రేణితో తల్లులను దర్శించుకున్నారు. బీజేపీ బీజాపూర్ జిల్లా అధ్యక్షుడు ఘాసి రామ్ నాగ్, మాజీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరావు ముద్దియార్, పంచాయతీ అధ్యక్షురాలు జానకి కోర్సా, బీజేపీ జిల్లా, మండల నాయకులు, యువ మోర్చా కార్యకర్తలు పెద్ద సంఖ్యలో వనదేవతలను దర్శించుకున్నారు.

# జీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడిపై అనుచిత వ్యాఖ్యలు మానుకోవాలి



అక్షర దర్బార్, (నాగూరు) వెంకటాపురం : గోండ్వానా సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణపై దుబ్బరాజు చేసిన అనుచిత వ్యాఖ్యలను జీఎస్పీ రాష్ట్ర కార్యదర్శి పూనెం సాయి ఖండించారు. వెంకటాపురం మండల కేంద్రంలో జీఎస్పీ కార్యకర్తల అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గోండ్వానా సంక్షేమ పరిషత్‌కు సుదీర్ఘ ఉద్యమ చరిత్ర ఉన్నదని గుర్తు చేశారు. చర్ల మండలానికి చెందిన దుబ్బరాజు వ్యక్తిగత లాభాల కోసం గిరిజన అభ్యుదయ సేవా సంఘం ఏర్పాటు చేసి, గిరిజనేతరులతో బేరసారాలు జరుపుతూ ఆదివాసీ చట్టాలను అపహస్యం చేస్తున్నారని విమర్శించారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు పూనెం ప్రతాప్, ఇతర జీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

# కుండపోత

- భారీ వర్షంతో ములుగు జిల్లా అతలాకుతలం
- అలుగు పోస్తున్న లక్నవరం సరస్సు
- పస్రా- నార్లపూర్ రూట్ లో రాకపోకలకు బ్రేక్

అక్షరదర్బార్, ములుగు: ములుగు జిల్లాలో వాన దంచి కొట్టింది. శుక్రవారం అర్ధరాత్రి నుంచి శనివారం ఉదయం వరకు కుండ పోత వర్షం కురిసింది. దీంతో జిల్లాలోని వాగులు, ఒర్రెలు వరద నీటితో పొంగి ప్రవహిస్తున్నాయి. ఫలితంగా ఏజెన్సీలోని పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గోవిందరావుపేట మండలంలోని లక్నవరం సరస్సు నీటితో నిండిపోయింది. సాయంత్రం నుంచి లక్నవరం సరస్సు అలుగు పోస్తుంది. పస్రా నుంచి నార్లాపూర్ మీదుగా మేడారం రాకపోకలు స్తంభించాయి. పస్రా-న్నార్లాపూర్ రూట్ లో రెండు కాజ్ వేల మీదుగా వరద నీరు ప్రవహిస్తుండటంతో శనివారం ఈ రూట్ లో రాకపోకలు నిలిచిపోయాయి. మోట్లగూడెం వద్ద పోలీసులు బారికేడ్లను ఏర్పాటు చేసి మేడారం వెళ్లే వాహనాలను పస్రా నుంచి తాడ్వాయి మీదుగా పంపించారు. 163 హైవే మీదుగా కూడా వరద నీరు ప్రవహించింది. పస్రాలో హైవే మీదుగా వరద నీరు ప్రవహించడం వల్ల వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. జిల్లాలోని పలు చెరువులు, కుంటలు నీటితో నిండి మత్తడి దుంకుతున్నాయి.







## అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ రాతహుల్ శర్మ
- మోరంచవాగు వరద ఉధృతి పరిశీలన

అక్షరదర్బార్, భూపాలపల్లి: జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ శనివారం మొరంచపల్లి వాగు ఉదృతిని ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వాగు ఉదృతి దృష్ట్యా ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు తలెత్తినపుడు తక్షణమే స్పందించి రక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖలకు ఆదేశించారు. ఎగువ భాగం నుండి ఎంత వరద వచ్చే అవకాశం ఉందన్న వివరాలు ఈ ఈ ప్రసాదు ను అడిగి తెలుసుకున్నారు. జాగ్రత్తగా ఉండాలని వరద పరిస్థితిని ముందుగా అంచనా వేసి ప్రజలను ముందస్తు అప్రమత్తం చేయాలని సూచించారు. వాతావరణ శాఖ సూచన మేరకు జిల్లాకు ఆదివారం వరకు రెడ్ అలెర్ట్ జారీ చేసిన నేపథ్యంలో యంత్రాంగం, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సిబ్బంది కార్యస్థానాల్లో అందుబాటులో ఉండి రక్షణ చర్యలు పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. భారీ వర్షాలు దృష్ట్యా ప్రజల, పశువుల ప్రాణరక్షణలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ముంపు ప్రాంతాలను గుర్తించి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అత్యవసర సేవలకు ప్రజలు జిల్లా కలెక్టర్ కార్యాలయంలో 24 గంటలు పనిచేసే విధంగా ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ నంబర్ కు కాల్ చేయాలని సూచించారు. 90306 32608 ద్వారా వచ్చిన ఫిర్యాదులకు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పశువులను మేతకు బయటికి పంపకుండా ఇంటి పట్టునే ఎత్తైన ప్రదేశంలో ఉంచాలని తెలిపారు. రహదారులపై నీళ్లు చేరిన ప్రాంతాల్లో ప్రజలు ప్రయాణాలు చేయకుండా పటిష్ట నియంత్రణ చేయాలని తెలిపారు. కొంతమంది. అత్యుత్సాహంతో ఎవరైనా దాటే ప్రయత్నం చేసే అవకాశం ఉన్నందున రెవెన్యూ, పోలీస్, పంచాయతీ రాజ్ సిబ్బంది పటిష్ట పర్యవేక్షణలో బారికేడ్లు ఏర్పాటు చేసి రవాణా నియంత్రణకు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఈఈ ప్రసాద్, డీఈ వరుణ్, ఏఈ షర్ఫుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## వచ్చే నెల నుంచి బ్యాగుల్లో
# రేషన్ బియ్యం?

### తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం




అక్షర దర్బార్, మొగుళ్ళపల్లి: తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకోబోతుంది. రాష్ట్రంలోని రేషన్ కార్డుదారులకి శుభవార్త చెప్పబోతుందని సమాచారం. మూడు నెలల రేషన్ ఒకేసారి పంపిణీ చేశారు కనుక.. ఆగస్టు వరకు రాష్ట్రంలో రేషన్ పంపిణీ ఆగిపోయింది. వచ్చె నెల అనగా సెప్టెంబర్ నుండి రేషన్ పంపిణీ తిరిగి ప్రారంభం కాబోతుంది. ఈ క్రమంలో రేషన్ తీసుకునే వారికి ఉచితంగా రేషన్ బ్యాగులను ఇవ్వనుంది. ఈ బ్యాగుల్లో సన్న బియ్యంతో పాటు, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాల వివరాలు కూడా ఉంటాయని తెలుస్తోంది. ఇప్పటికే ఈ బ్యాగులు రాష్ట్రంలోని అన్ని రేషన్ డిపోలకు చేరాయని అధికారులు తెలిపారు. సెప్టెంబర్ నెల నుంచి రాష్ట్రంలోరేషన్ తీసుకునే వారికి సన్న బియ్యంతో పాటు ఈ ప్రత్యేకమైన బ్యాగులను ఉచితంగా ఇవ్వనున్నారు. ఈ బ్యాగును బయట కొనాలంటే రూ.50 వరకు ఉంటుంది. ఈ బ్యాగులపై సీఎం రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కల ఫొటోలతో పాటుగా.. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఫొటో కూడా ఉంటుంది. అలానే ఈ బ్యాగు మీద ఇందిరమ్మ అభయ హస్తం పేరుతో ఆరు గ్యారంటీలకు సంబంధించిన వివరాలను కూడా ముద్రించారు.

## పోగొట్టుకున్న సెల్ ఫోన్ అప్పగింత




అక్షర దర్బార్, మొగుళ్లపల్లి: మండలంలోని పాత ఇసిపేట గ్రామానికి చెందిన నేర్పటి నరేష్ పోగొట్టుకున్న ఫోన్ ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి శనివారం మొగుళ్లపల్లి లో ట్రైనీ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న మానస చేతుల మీదుగా బాధితుడికి సెల్ ఫోన్ అప్పగించారు. ఫోన్ ని ట్రేస్ చేయడంలో ముఖ్యపాత్ర వహించిన సీఈఐఆర్ పోర్టల్ ఆపరేటర్ కానిస్టేబుల్ జ్యోతిని ఎస్ఐ అభినందించారు.



## ఇర్ప లక్ష్మిది ముమ్మాటికీ ప్రభుత్వ హత్యే

### ఆదివాసీ నవనిర్మాణ సేన

అక్షర దర్బార్, (నూగూరు) వెంకటాపురం :
లక్ష్మీపురం గ్రామానికి చెందిన ఆశావర్కర్ ఇర్ప లక్ష్మి వాగు దాటే క్రమంలో మరణించడం ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే జరిగిందని ఆదివాసీ నవనిర్మాణ సేన జిల్లా అధ్యక్షుడు కుంజ మహేష్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. శనివారం గ్రామాన్ని సందర్శించిన ఆయన, లక్ష్మి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ – "బ్రిడ్జి లేకపోవడం వల్లే లక్ష్మి మృతిచెందింది. పాలకుల నిర్లక్ష్యానికి ఇంకా ఎంతమంది ఆదివాసీలు బలి కావాలి?" అని ప్రశ్నించారు. స్థానిక ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు, ఐటీడీఏ అధికారులు కుటుంబాన్ని పరామర్శించకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. లక్ష్మి కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, లక్ష్మీపురం గ్రామానికి మౌలిక సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివాసీ గూడెల్లో విద్య, వైద్యం, త్రాగునీరు, రహదారులు వంటి వసతులు లేకపోవడాన్ని తీవ్రంగా విమర్శించిన ఆయన, "వేల కోట్లు కేటాయిస్తున్న గిరిజన సబ్ ప్లాన్ నిధులు ఎక్కడ ఖర్చవుతున్నాయి?" అని ప్రశ్నించారు.

## అటు కుక్కల గోల, ఇటు పశువుల బెడద

- ప్రమాదాలకు నిలయంగా మారిన బస్టాండ్ కూడలి
- మున్సిపల్ అధికారులు పట్టించుకోవాలి



అక్షర దర్బార్, పరకాల: పరకాల పట్టణంలోని రోడ్లపై కుక్కలు పశువుల సంచారంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పరకాల బస్టాండ్ కూడాలలో సాయంత్రమైతే ఇటు కుక్కలు అటు పశువులు గుంపులు గుంపులుగా రోడ్లపై నిలబడి ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి. కుక్కలు బస్టాండ్ కూడలిలో గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ఒక్కసారిగా పరిగెత్తి ఏ బండికి వెళ్ళుతాయో అని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పరకాల పట్టణంలో దాదాపు రెండు మూడువందల కుక్కలు ఉన్నట్లు ప్రజలు పేర్కొంటున్నారు. అదేవిధంగా పశువులను వాటి యజమానులు పట్టించుకోకుండా రోడ్లపై వదిలివేయడంతో రాత్రి వేళలో అవి రోడ్లపై పడుకొని ప్రమాదలకు గురి చేస్తున్నాయని ప్రజలు పేర్కొంటున్నారు. పశువులు, కుక్కలపై మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.




# మీ గొంతుక!
# మీ నమ్మకం!

## అక్షర దర్బార్

ప్రతి అక్షరం.. ప్రజా సంక్షేమం!

## ఎందుకు అక్షర దర్బార్?

- **నిజమైన వార్తలు** : నిష్పక్షపాతంగా, పారదర్శకంగా వార్తలను అందిస్తాం.
- **మీ సమస్యల పరిష్కారం** : స్థానిక సమస్యల నుండి ప్రభుత్వ పథకాల అమలు వరకు, మీ ప్రతి సమస్యను వెలుగులోకి తెస్తాం.
- **సమాజహితమే లక్ష్యం** : ప్రజల గొంతుకగా మారి, సామాజిక బాధ్యతతో పనిచేస్తాం.
- **ఈ-పేపర్ అందుబాటులో** : ఎక్కడ ఉన్నా, ఎప్పుడైనా మీ వార్తలను చదవండి.

డిజిటల్ విప్లవంలో భాగంకండి!

"అక్షర దర్బార్" ఈ-పేపర్ కోసం QR కోడ్‌ను స్కాన్ చేయండి.
వేగంగా, సులభంగా వార్తలను పొందండి.

**ప్రతిరోజూ మీ ఇంటికి, మీ మనసుకి చేరువగా "అక్షర దర్బార్"!**

# మీ నమ్మకమే మా బలం!


Printed, Published & Owned by VEMULA RAJESHWER RAO, printed at VR PUBLICATIONS, H.NO 7-1-364/16/A, Sriram Nagar, Padmakshi gutta colony, Hanamkonda, Pin 506001, Telangana State.
Editor : VEMULA RAJESHWAR RAO, Email : akshardarbarnews@gmail.com, Office No:7680992278 *RNI NO.TELTEL/2022/81915